




# ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్

EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 190 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/- | శుక్రవారం 14 ఫిబ్రవరి 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


## యంగ్ ఇండియా స్కూళ్లకు స్థలాలపై

### వారంలో నివేదిక ఇవ్వాలి: సీఎం రేవంత్

యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం కోసం త్వరగా స్థలాలు గుర్తించాలని కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

**హైదరాబాద్, ఫిబ్రవరి 14, (రిపబ్లిక్ న్యూస్):** యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం కోసం త్వరగా స్థలాలు గుర్తించాలని కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ప్రతి నియోజకవర్గంలో స్కూళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే.



దీనిపై సీఎం విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్కూళ్లకు స్థలాల సేకరణపై ఆరా తీశారు. గడువులోగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. "స్థలాలు కేటాయిస్తే అనుమతుల పనులు వేగవంతం చేయాలి. స్కూళ్లకు స్థలాలు అనువుగా ఉన్నాయో లేదో పరిశీలించాలి. అనువుగా లేని చోట ప్రత్యామ్నాయ స్థలం సేకరించాలి. కలెక్టర్లు వీలైనంత త్వరగా స్థలాలు గుర్తించాలి. దీనిపై వారంలోగా నివేదిక ఇవ్వాలి. 105 స్థానాల్లో రెండేళ్లలో పనులు పూర్తయ్యేలా చూడాలి. చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీలో సరైన వసతులు కల్పించాలి. వర్సిటీ అభివృద్ధి కోసం నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని సీఎం తెలిపారు.


## యువతిపై యాసిడ్ దాడి..

## నిందితుడిపై కఠిన చర్యలకు సీఎం చంద్రబాబు ఆదేశం

అన్నమయ్య జిల్లాలో యువతిపై యాసిడ్ దాడి ఘటనను సీఎం చంద్రబాబు ఖండించారు.

**అమరావతి, ఫిబ్రవరి 14, (రిపబ్లిక్ న్యూస్):** అన్నమయ్య జిల్లాలో యువతిపై యాసిడ్ దాడి ఘటనను సీఎం చంద్రబాబు ఖండించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత యువతి, ఆమె కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు. గుర్రంకొండ మండలం ప్యారంపల్లెలో గణేశ్ అనే యువకుడు ఓ యువతి తలపై కత్తితో గాయపరిచి ముఖంపై యాసిడ్ పోశాడు. గాయాలపాలైన బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏప్రిల్ 29న ఆమె పెళ్లి జరగనున్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. నిందితుడిని మదనపల్లెలోని అమ్మచెరువు మిట్టకు చెందినవాడిగా గుర్తించారు.



## అన్నమయ్య జిల్లాలో యువతిపై యాసిడ్ దాడి

అన్నమయ్య జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. గుర్రంకొండ మండలం ప్యారంపల్లెలో యువతి పై యాసిడ్ దాడి జరిగింది.

**మదనపల్లె, ఫిబ్రవరి 14, (రిపబ్లిక్ న్యూస్):** అన్నమయ్య జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. గుర్రంకొండ మండలం ప్యారంపల్లెలో యువతిపై యాసిడ్ దాడి జరిగింది. ఓ యువకుడు యువతి తలపై కత్తితో గాయపరిచి ముఖంపై యాసిడ్ పోశాడు. గాయాలపాలైన బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



వివరాల్లోకి వెళితే.. ప్యారంపల్లెకు చెందిన యువతి డిగ్రీ వరకు చదువుకుని మదనపల్లెలోని ఓ బ్యూటీ పార్లర్లో పనిచేస్తోంది. పట్టణంలోని అమ్మచెరువుమెట్టకు చెందిన గణేశ్ అనే యువకుడు ఆమెను ప్రేమ పేరుతో తరచూ వేధింపులకు గురిచేసేవాడు. యువతికి ఈనెల 7న బంధువుల అబ్బాయితో నిశ్చితార్థం జరిగింది. ఏప్రిల్ 29న ఆమె పెళ్లి జరగనున్నట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న గణేశ్.. శుక్రవారం ఉదయం 6 గంటలకు గ్రామానికి చేరుకున్నాడు. యువతి తల్లిదండ్రులు పొలానికి వెళ్లిన సమయంలో ఆమె వద్దకు వెళ్లి ముఖంపై యాసిడ్ పోసి కత్తితో దాడి చేశాడు. యువతి కేకలు వేయడంతో చుట్టు పక్కలవాళ్లు వచ్చారు. అప్పటికే నిందితుడు పరారయ్యాడు. కుటుంబ సభ్యులు యువతిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. యాసిడ్ దాడి వల్ల బాధితురాలి ముఖంపై గాయాలయ్యాయి. నిందితుడు కూడా యాసిడ్ తాగినట్లు.. వేరే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. గుర్రంకొండ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

### నిందితుడిని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు:మంత్రి అనిత

యాసిడ్ దాడి ఘటనపై రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీతో మాట్లాడిన మంత్రి.. ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబసభ్యులతోనూ మంత్రి ఫోన్లో మాట్లాడారు. మెరుగైన వైద్యం కోసం అవసరమైతే బెంగళూరుకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. నిందితుడిని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించరాదని పోలీసులను ఆదేశించారు. మంత్రి లోకేశ్ సైతం ఘటనపై స్పందించారు. యువతిపై యాసిడ్ దాడి తనను తీవ్ర ఆందోళనకు గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. యువతికి మెరుగైన వైద్య సాయం అందించి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని.. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు.



# హీరో విజయ్‌కు వై ఫ్లస్ భద్రత

టీవీకే అధినేత విజయ్‌కు సంబంధించి కేంద్ర హోం మంత్రిత్వశాఖ కీలక ప్రకటన చేసింది.

**దిల్లీ, ఫిబ్రవరి 14, (రిపబ్లిక్ న్యూస్):** తమిళగ వెట్రి కళగం అధినేత, ప్రముఖ నటుడు విజయ్‌కు సంబంధించి కేంద్ర హోం శాఖ కీలక ప్రకటన చేసింది. ఆయనకు వై ఫ్లస్ భద్రత కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పొంచి ఉన్న ముప్పుపై నిఘా సమాచారం ఆధారంగా ఏ స్థాయి భద్రత కల్పించాలనే దానిపై ప్రభుత్వం నిర్ణయం ఉంటుంది.



ఈ క్రమంలోనే తాజా నిర్ణయం వెలువడింది. వై ఫ్లస్ భద్రత నాలుగో అత్యున్నత స్థాయి భద్రత. మొత్తం 11 మంది సిబ్బంది షిఫ్టుల వారీగా భద్రత కల్పిస్తారు. వారిలో ఇద్దరి నుంచి నలుగురు కమాండోలు, మిగిలినవారు పోలీసు సిబ్బంది ఉంటారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ఏడాదికి పైగా సమయం ఉంది. 2026లో జరిగే ఎన్నికల బరిలో దిగుతామని పార్టీని ప్రారంభించిన సమయంలోనే విజయ్ ప్రకటించారు. అలాగే ఆయన ప్రజా సంబంధ అంశాలపై తన అభిప్రాయాన్ని చురుగ్గా వెల్లడిస్తున్నారు. ఇదిలాఉంటే.. ఇటీవల విజయ్ పార్టీ నేతలు ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో మంతనాలు జరిపారు. అది తమిళ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. దీంతో వచ్చే ఎన్నికల్లో టీవీకేకు పీకే ప్రత్యేక సలహాదారుగా ఉండనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి.

## 'నేను ఆఖరి రెడ్డి సీఎంను అయినా.. ఫర్వాలేదు': సీఎం రేవంత్ రెడ్డి

"నేను ఆఖరి రెడ్డి సీఎంను అయినా.. ఫర్వాలేదు. మా నాయకుడు ఇచ్చిన మాట నిలబెట్టేందుకు క్రమక్షశిణ కలిగిన ముఖ్యమంత్రిగా బాధ్యత తీసుకున్నా.

**హైదరాబాద్, ఫిబ్రవరి 14, (రిపబ్లిక్ న్యూస్):** "నేను ఆఖరి రెడ్డి సీఎంను అయినా.. ఫర్వాలేదు. మా నాయకుడు ఇచ్చిన మాట నిలబెట్టేందుకు క్రమక్షశిణ కలిగిన ముఖ్యమంత్రిగా బాధ్యత తీసుకున్నా. ఇది నా నిబద్ధత. కులగణన.. నా కోసం, నా పదవి కోసం చేయలేదు. త్యాగానికి సిద్ధపడే.. కులాల లెక్కలు పక్కాగా తేల్చాం. మా నాయకుడి ఆదర్శం నిలబెట్టేందుకు నేను కార్యకర్తగా మిగిలేందుకు సిద్ధం" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.



హైదరాబాద్ గాంధీభవన్లో నిర్వహించిన కులగణన, ఎస్సీ వర్గీకరణపై పవర్ పాయింట్ ప్రజంటేషన్లో సీఎం ప్రసంగించారు. "కొందరు ఆరోపిస్తున్నట్లు కులగణన సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగలేదు. ఇప్పుడు కులగణన సర్వేను తప్పు పడితే బీసీలు శాశ్వతంగా నష్టపోతారు. దేశం మొత్తం కూడా కులగణన సర్వే జరగాలని పార్లమెంట్లో మోదీని రాహుల్గాంధీ నిలదీశారు. ఈ సర్వే జరగకూడదని మోదీ, కేసీఆర్ కలిసి కుట్ర చేస్తున్నారు. నరేంద్రమోదీ పుట్టుకతో బీసీ కులస్థుడు కాదు. గుజరాత్ సీఎం అయ్యాక ఆయన కులాన్ని బీసీ జాబితాలో చేర్చుకున్నారు. సర్టిఫికెట్ ప్రకారం మాత్రమే మోదీ బీసీ వ్యక్తి.. ఆయన వ్యక్తిత్వం మాత్రం అగ్ర కులం. కులగణన జరిగితే చట్ట ప్రకారం రిజర్వేషన్లు సాధించుకోవచ్చు. అధికారిక లెక్కలు ఉంటే బీసీల రిజర్వేషన్లు పెంచాలని సుప్రీంకోర్టు కూడా చెప్పొచ్చు. కులగణన సర్వే రెండో విడత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు ఇంటి ముందు మేలుకొలుపు డప్పు కొట్టాలని బీసీ సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నా. సర్వేలో పాల్గొనకపోతే సామాజిక బహిష్కరణే శిక్ష" అని సీఎం రేవంత్రెడ్డి అన్నారు.


## బెస్ట్ సీఎంల జాబితా..

## నాలుగో స్థానంలో చంద్రబాబు

దేశంలోని ఉత్తమ ముఖ్యమంత్రుల జాబితాలో నాలుగో స్థానంలో నిలిచిన ఏపీ సీఎం చంద్రబాబుకు.. గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అభినందనలు తెలిపారు.

**విజయవాడ, ఫిబ్రవరి 14, (రిపబ్లిక్ న్యూస్):** దేశంలోని ఉత్తమ ముఖ్యమంత్రుల జాబితాలో నాలుగో స్థానంలో నిలిచిన ఏపీ సీఎం చంద్రబాబుకు.. గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అభినందనలు తెలిపారు. ఇండియాటుడే సర్వేలో చంద్రబాబు నాలుగో స్థానంలో నిలవడం తమకు గర్వకారణమని పేర్కొన్నారు.

అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే ఐదో స్థానం నుంచి నాలుగో స్థానానికి చేరుకోవడం సంక్షేమం కోసం ఆయన పడుతున్న శ్రమ, పట్టుదలతో పనిచేస్తున్న తీరుకు నిదర్శనమన్నారు. కొద్ది నెలల్లోనే రూ.6.5 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించడం ప్రజలకు, పెట్టుబడి దారులకు ఆయన మీద ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. ఐదేళ్లపాటు అన్ని రంగాల్లో విధ్వంసాన్ని చవిచూసిన రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతి పట్టా లెక్కించేందుకు ముఖ్యమంత్రి నిరంతరం శ్రమించడం అందరికీ మార్గదర్శకమని తెలిపారు. ప్రజలకు వాగ్దానం చేసిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయటానికి, యువతకు ఉద్యోగ.. ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని సీఎం ముందుండి నడిపిస్తున్నారన్నారు. సీఎం మార్గదర్శకత్వంలో తాము కూడా అన్ని విధాలుగా కష్టపడుతున్నామని తెలిపారు. ఎన్నికల హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి 20 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఆశయాన్ని ప్రభుత్వం త్వరలోనే చేరుకుంటుందని మంత్రి పార్థసారథి వెల్లడించారు.



## విజయవాడలో యూపీ ముఠా భారీ చోరీ..

## రూ.2.5 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం

వాళ్లంతా చిన్న చిన్న పనులు చేసుకునే రోజువారీ కూలీలే కానీ, దేశ వ్యాప్తంగా ఎక్కడ ఎలక్ట్రానిక్ వేర్హౌస్లు ఉన్నాయో వివరాలు సేకరిస్తారు.

**విజయవాడ, ఫిబ్రవరి 14, (రిపబ్లిక్ న్యూస్):** వాళ్లంతా చిన్న చిన్న పనులు చేసుకునే రోజువారీ కూలీలే. కానీ, దేశ వ్యాప్తంగా ఎక్కడ ఎలక్ట్రానిక్ వేర్ హౌస్లు ఉన్నాయో వివరాలు సేకరిస్తారు. ముందుగా రెక్కీ నిర్వహించి.. ఎవరికీ దొరక్కుండా ఉండేందుకు పక్కా ప్లాన్తో దోపిడీ చేస్తారు. తాజాగా నగరంలో సంచలనం రేపిన రూ.2.5కోట్ల విలువైన ఐ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాల చోరీ కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడ పోలీసులు ఏర్పాటు చేసిన సురక్ష పథకం నిందితులను పట్టించింది.

వారి నుంచి రూ.2.5కోట్ల విలువైన ఐ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన డీప్ చంద్ ప్రజాపతి కార్ ట్రావెల్స్ నిర్వహిస్తున్నాడు. అతని స్నేహితులైన సునీల్ కుమార్, జయప్రకాష్‌ను విజయవాడలోని వేర్ హౌసింగ్లో ఐఫోన్లు చోరీ చేద్దామని చర్చించారు. ఈనెల 5న చోరీ చేసేందుకు విజయవాడకు చేరుకున్నారు. మొత్తం ఆరుగురు కలిసి దోపిడీ చేసేందుకు స్కెచ్ వేశారు. ముందుగా రెక్కీ నిర్వహించారు. మొదట గోడౌన్ రేకులు కట్ చేశారు. ఆ తర్వాత పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు సీసీ కెమెరా వైరును కట్ చేశారు. దర్జాగా రూ.2.5కోట్ల విలువ చేసే సరుకును దోచేశారు. వేర్ హౌస్ యజమాని ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసిన పటమట పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాల ద్వారా నిందితుల కారును గుర్తించి.. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కారు బిహార్లో ఉన్నట్లు గుర్తించి.. అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. బిహార్ పోలీసుల సాయంతో నిందితులను అరెస్ట్ చేశారు. రెండు గంటలు ఆలస్యమైతే నిందితులు సెల్ ఫోన్లను నేపాల్లో విక్రయించే వారని సీపీ రాజశేఖర బాబు తెలిపారు. రంజిత్ అనే వ్యక్తి నిందితులకు గోడౌన్ల వివరాలు అందిస్తారని పోలీసులు గుర్తించారు. విజయవాడ సిటీ పరిధిలో సురక్ష పథకంలో భాగంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయటంతో నిందితులను సులువుగా గుర్తించగలిగామని సీపీ తెలిపారు.



## నూతన సీఈసీగా జ్ఞానేశ్ కుమార్..?

నూతన సీఈసీని ఎన్నుకునేందుకు ఫిబ్రవరి 17న ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎంపిక కమిటీ సమావేశం కానున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

**దిల్లీ, ఫిబ్రవరి 14, (రిపబ్లిక్ న్యూస్):** నూతన సీఈసీని ఎన్నుకునేందుకు ఫిబ్రవరి 17న ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎంపిక కమిటీ సమావేశం కానున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. నూతన సీఈసీగా జ్ఞానేశ్ కుమార్‌ను ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ప్రస్తుత సీఈసీ రాజీవ్ కుమార్ ఫిబ్రవరి 18న పదవీ విరమణ చేయనున్నారు. ఈ కమిటీలో ప్రధాని నరేంద్ర మోదీతో పాటు, కేంద్ర న్యాయశాఖమంత్రి అర్జున్ మేఘవాల్, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సభ్యులుగా ఉన్నారు. జ్ఞానేశ్ కుమార్ కేరళ కేడర్కు చెందిన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఇంతకు ముందు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆధ్వర్యంలోని సహకార మంత్రిత్వ శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖల కార్యదర్శిగా పని చేసి రిటైర్ అయ్యారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఏర్పాటుతో సహా అయోధ్య కేసుపై సుప్రీం కోర్టు తీర్పునకు సంబంధించిన అన్ని విషయాలను చూసేందుకు హోం మంత్రిత్వ శాఖలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగానికి నాయకత్వం వహించారు.




## వంట మనిషితో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన.. స్తంభానికి కట్టేసి దేహశుద్ధి

వంట మనిషితో అసభ్యంగా ప్రవర్తించి, ఆమెపై చెప్పుతో దాడి చేసిన ఓ ఉపాధ్యాయుడికి అదే గ్రామానికి చెందిన కొందరు దేహశుద్ధి చేశారు.

**కురిచేడు, ఫిబ్రవరి 14, (రిపబ్లిక్ న్యూస్):** వంట మనిషితో అసభ్యంగా ప్రవర్తించి, ఆమెపై చెప్పుతో దాడి చేసిన ఓ ఉపాధ్యాయుడికి అదే గ్రామానికి చెందిన కొందరు దేహశుద్ధి చేశారు. విద్యుత్ స్తంభానికి కట్టేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా కురిచేడు మండలం పడమర నాయుడుపాలెం పంచాయతీలోని వీవై కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేముల వెంకట రవికుమార్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. అదే పాఠశాలలో వంట మనిషిగా పనిచేస్తున్న మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా చెప్పుతో కొట్టాడు. విషయం తెలుసుకున్న ఆ గ్రామ పెద్దలు ఉపాధ్యాయుడిని నిలదీయగా.. 'మీరేంటి నాకు చెప్పేది..' అంటూ వారిపై ఎదురుదాడికి దిగాడు. రవికుమార్ ఎంతకూ వినకపోవడంతో స్థానికులు విద్యుత్ స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఉపాధ్యాయుడిని పీఎస్కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) నాయక్ పాఠశాలకు వెళ్లి ఘటనపై ఆరా తీశారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com


ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం



## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **AD 496 (Rome)**: ప్రేమికుల రోజు
- **1779**: నావికుడు,సముద్రయానికుడు, సాహస యాత్రికుడు జేమ్స్ కుక్ మరణం (జ.1728).
- **1898**: విజయవాడకు చెందిన న్యాయవాది, రచయిత దిగవల్లి వేంకటశివరావు జననం (మ.1992).
- **1921**: ఆంధ్రప్రదేశ్ రెండవ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జననం (మ.1954). (చిత్రంలో)
- **1931**: మజ్లిస్ ఎ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పార్టీ నాయకుడు సుల్తాన్ సలాహుద్దీన్ ఒవైసీ జననం (మ.2008).
- **1952**: భారతీయ జనతా పార్టీకి చెందిన మహిళా నేత, కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్ జననం.
- **1973**: తెలుగు సినిమా దర్శకుడు, నిర్మాత, నటుడు వై.వి.రావు మరణం (జ.1903).
- **1983**: తెలుగు సినిమా హాస్యనటుడు రాజబాబు మరణం (జ.1935).


ప్రేమికుల రోజు


జేమ్స్ కుక్


దిగవల్లి వేంకటశివరావు


దామోదరం సంజీవయ్య


సుల్తాన్ సలాహుద్దీన్ ఒవైసీ


సుష్మాస్వరాజ్


వై.వి.రావు


రాజబాబు

## ప్రసాద్ మల్టీప్లెక్స్‌లో విష్వక్ సందడి..

'లైలా' విడుదల నేపథ్యంలో విష్వక్ సేన్ ప్రసాద్ మల్టీప్లెక్స్‌లో సందడి చేశారు. ఈ సినిమాను ఆదరించాలని కోరారు.



విష్వక్ సేన్ ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'లైలా'. ఎన్నో వివాదాల మధ్య నేడు ప్రేక్షకుల ముందుకువచ్చి పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. ఈ సినిమా విడుదల నేపథ్యంలో విష్వక్ సేన్ ప్రసాద్ మల్టీప్లెక్స్ లో సందడి చేశారు. అభిమానులతో కలిసి ఫొటోలు దిగారు. సినిమాను ఆదరించాలని కోరారు. సినిమా విడుదల సందర్భంగా ప్రముఖ దర్శకుడు సుకుమార్ చిత్రబృందానికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఆ పోస్టు షేర్ చేసిన విష్వక్ సుకుమారు ధన్యవాదాలు తెలిపారు. ఇక ఈ సినిమా విడుదలకు ముందు విష్వక్ ఎమోషనల్ వీడియో విడుదల చేశారు. "లైలా' సినిమా విడుదలకు ముందు ఎన్నో వివాదాలు వచ్చాయి. నా తప్పు లేకపోయినా.. మా టీమ్ తరఫున నేను క్షమాపణలు కూడా చెప్పాను. అందరం కోపాలు తగ్గించుకుందాం. అపార్థాలు తొలగించుకుందాం. నేను మీలో ఒకడిని. సినీ నేపథ్యం లేకుండా ఈ స్థాయికి వచ్చాను. నేను గెలిస్తే మీరు గెలిచినట్లే. నన్ను ఆదరిస్తే మంచి పాత్రలు చేయగలను. 'లైలా'కు మీ మద్దతు కావాలి. ఈ సినిమా చూసి కచ్చితంగా నవ్వుకుంటారు. థియేటర్కు వచ్చే ప్రేక్షకులను నవ్వించాలనే లక్ష్యంతోనే ఈ సినిమాను తెరకెక్కించాం. ఈ సినిమా మీద చాలామంది కొత్తవాళ్ల జీవితం ఆధారపడి ఉంది. జరిగిన సంఘటనలను సినిమాకు ఆపాదించొద్దు. 'లైలా' చూశాక.. ఈ సినిమానా మనం అపార్థం చేసుకుంది అని అనుకుంటారు. అంత మంచి సినిమా ఇది" అని చెప్పారు. మరోవైపు 'లైలా' సినిమా వేడుకలో తాను చేసిన వ్యాఖ్యలపై ఎవరి మనోభావాలైనా దెబ్బతినివుంటే క్షమించమని నటుడు పృథ్వీరాజ్ కోరారు. వ్యక్తిగతంగా ఎవరిపైనా తనకు ద్వేషం లేదన్నారు. "లైలా' సినిమాని కిల్ చేయకండి. సినిమాని గౌరవిద్దాం.. ప్రేమిద్దాం. నాకింత క్రేజ్ వచ్చిందంటే సినిమానే కారణం. నావల్ల ఈ సినిమా ఇబ్బందిపడకూడదు. ఇంతటితో దీనికి ముగింపు పలకండి" అని అన్నారు.

## ఆ కారణంగా ఎన్నో అవకాశాలు కోల్పోయా: రెజీనా

హిందీ పరిశ్రమలో దక్షిణాది నటీనటులు కొనసాగడం కష్టమని రెజీనా అన్నారు. తాను ఎన్నో అవకాశాలు కోల్పోయినట్లు చెప్పారు.



ఇండస్ట్రీకి వచ్చిన 14 ఏళ్ల తర్వాత బాలీవుడ్ పరిశ్రమలోకి అడుగుపెట్టారు నటి రెజీనా. ప్రస్తుతం హిందీలో రెండు సినిమాలు చేస్తున్నారు. తాజాగా ఆమె ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బాలీవుడ్లో దక్షిణాది నటీనటులు కొనసాగడం కష్టమన్నారు. భాష రాకపోవడం వల్ల తాను ఎన్నో అవకాశాలు కోల్పోయినట్లు చెప్పారు. "నేను 9 సంవత్సరాల వయసు నుంచి నటించడం ప్రారంభించాను. 25 ఏళ్లుగా ఎన్నో సినిమాలు, ప్రకటనల్లో నటించాను. కాబట్టి నాకు ఇండస్ట్రీ మీద అవగాహన ఉంది. పరిశ్రమలో నటిగా ఉండడం.. ముఖ్యంగా బాలీవుడ్లో లో దక్షిణాది నటిగా కొనసాగడం చాలా కష్టం. నేను హిందీ సినిమా కోసం ఆడిషన్ ఇచ్చినప్పుడు ఈ భాష మాట్లాడగలనో, లేదో అని చూశారు. దక్షిణాది సినిమా పరిశ్రమలో ఈ విషయాన్ని పట్టించుకోరు. ఏ భాషకు చెందినవారినైనా ఎంపిక చేసుకుంటారు. అందుకే కోలీవుడ్, టాలీవుడ్లలో ఇతర భాషలకు చెందిన ఎంతోమంది నటీనటులు అగ్ర తారలుగా ఎదిగారు. నేను హిందీ సరిగ్గా మాట్లాడలేకపోయినందున ఎన్నో అవకాశాలు కోల్పోయాను. నేను పంజాబీ అమ్మాయిగా నటించలేను. కానీ, ఒక పంజాబీ అమ్మాయి మాత్రం దక్షిణాది నటిగా చేయగలదు. నా విషయంలో అదే జరిగింది. నార్త్ నటిస్తున్న హీరోయిన్లే సౌత్ ఇండియన్ సినిమాల్లోనూ నటిస్తున్నారు" అని చెప్పారు. సినిమాల విషయానికొస్తే.. రెజీనా ఇటీవల 'విదాముయార్చి'లో కనిపించారు. అగ్ర కథానాయకుడు అజిత్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాను మగిజ్ తిరుమేని తెరకెక్కించారు. త్రిష. రెజీనా కీలకపాత్రల్లో కనిపించారు. ప్రస్తుతం రెజీనా రెండు హిందీ సినిమాలు, ఓ తమిళ చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్నారు.

## రిపబ్లిక్ సినిమా CINEMA

### దర్శకుడితో ముదిరిన వివాదం..

## వీడియో ప్రూఫ్లు పంచుకున్న నటి



'గదర్ 2' క్లైమాక్స్ విషయంలో దర్శకుడు అనిల్ శర్మ, నటి అమీషా పటేల్ ల మధ్య వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆమె తాజాగా కొన్ని వీడియో ప్రూఫ్లు పంచుకున్నారు..

'గదర్ 2' క్లైమాక్స్ విషయంలో దర్శకుడు అనిల్ శర్మ, నటి అమీషా పటేల్ మధ్య వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అనిల్ శర్మ తీరును తప్పుపడుతూ సినిమా స్టోరీ నరేషన్కు సంబంధించిన కొన్ని వీడియోలను ఆమె సోషల్మీడియా వేదికగా పంచుకున్నారు. ఇప్పుడు ఆయన ఏం సమాధానం చెబుతారంటూ ప్రశ్నించారు. "గదర్ 2' నరేషన్కు సంబంధించిన వీడియోలివి. క్లైమాక్స్లో విలన్ను సకీనానే (అమీషా పటేల్ పాత్ర) చంపుతుందని ఆయన నాతో చెప్పారు. ఇప్పుడు మాత్రం ఆయన తాను ఆ విధంగా చెప్పలేదని అంటున్నారు. అలా ఎలా చెబుతారు? ఇప్పుడు మీరెలా దీనిని అంగీకరించడం లేదు" అని ఆమె రాసుకొచ్చారు. 'గదర్ ఏక్ ప్రేమ్కథ'కు సీక్వెల్గా 'గదర్ 2' తెరకెక్కింది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఇది రూపుదిద్దుకుంది. సన్నీడియోల్, అమీషా పటేల్ ప్రధాన పాత్రలు పోషించారు. గతేడాది విడుదలై ఘన విజయాన్ని అందుకుంది. తనకు మాట మాత్రం చెప్పకుండా దర్శకుడు సినిమా క్లైమాక్స్ మార్చేశారని ఓ ఇంటర్వ్యూలో అమీషా అన్నారు. "ప్రతి నాయకుడి పాత్రను సకీనానే (అమీషా పటేల్ పాత్ర పేరు) చంపాలని తొలుత ఆయన రాసుకున్నారు. అది నాకెంతో నచ్చింది. కానీ షూట్కు వచ్చేసరికి అనిల్ సీన్ మార్చేశారు. ప్రతినాయకుడి పాత్రను చరణ్ జీత్ (అనిల్ శర్మ తనయుడు ఉత్కర్ష్ శర్మ పాత్ర) చంపేలా క్రియేట్ చేశారు. షూట్ జరిగేవరకూ ఆ విషయం నాక్కూడా తెలియదు" అని అన్నారు. దీంతో ఈ వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. దీనిపై స్పందించిన అనిల్ శర్మ.. అమీషా వ్యాఖ్యల్లో నిజం లేదని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. "గదర్ 2" గురించి మేము మాట్లాడుకున్నప్పుడు సకీనా (అమీషా పటేల్ పాత్ర) కూడా పాకిస్థాన్ వెళ్తుంది కదా అని ఆమె నన్ను అడిగింది. అలాంటిది ఏమీ లేదని.. నాకు అలాంటి ఉద్దేశం లేదని తేల్చి చెప్పేశాను. తారాసింగ్ (సన్నీడియోల్ పాత్ర) తనతోపాటు అందరినీ తీసుకువెళ్లడానికి పాకిస్థాన్ ఏమైనా పర్యటక ప్రాంతమా? తన కుమారుడు చరణ్ జీత్ కిడ్నాప్ అయినప్పుడు.. అతడిని విడిపించడానికి తారాసింగ్ భార్యను వెంటపెట్టుకొని వెళ్తాడా?" అని ప్రశ్నించారు.

## వాలంటైన్స్ డే.. అది వారికి సంబంధించింది కాదు :ఉపాసన సరదా పోస్ట్

ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆన్లైన్ వేదికగా ఓ సరదా పోస్టు పంచుకున్నారు నటుడు రామ్ చరణ్ సతీమణి ఉపాసన. అందులో రాసి ఉన్న సందేశంపై ఆమె నవ్వులు పూయించారు.



ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆన్లైన్ వేదికగా ప్రత్యేక పోస్టులు, విషెస్ చెబుతున్నారు సినీ తారలు, నెటిజన్లు. ఈ నేపథ్యంలోనే ఓ సరదా పోస్టు నెటిజన్లతో పంచుకున్నారు నటుడు రామ్ చరణ్ సతీమణి ఉపాసన. అందులోని సందేశంపై ఆమె నవ్వులు పూయించారు. "వాలంటైన్స్ డే అనేది 22 ఏళ్లు అంతకంటే తక్కువ వయసు ఉన్న అమ్మాయిలకు సంబంధించినది. మీరు అంతకంటే ఎక్కువ వయసు ఉన్నవారు అయితే.. ఆంటీ దయచేసి ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే కోసం ఎదురు చూడండి" అని ఆ పోస్ట్లో రాసి ఉంది. ఇన్స్టా స్టోరీస్ వేదికగా ఈ సరదా పోస్టు షేర్ చేసిన ఉపాసన స్మైలీ ఎమోజీలు జత చేశారు. దీనిపై నెటిజన్లు సైతం నవ్వులు పూయిస్తున్నారు.

### సతీమణికి సుకుమార్ గిఫ్ట్..

'పుష్ప 2' ఘన విజయంతో సంతోషంగా ఉన్నారు దర్శకుడు సుకుమార్. ఈ నేపథ్యంలోనే గురువారం ఈ దర్శకుడి ఇంట ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దీనికి సంబంధించిన ఫొటోలను సుకుమార్ సతీమణి ఇన్స్టాలో పంచుకున్న విషయం తెలిసిందే. తాజాగా తన జీవిత భాగస్వామికి వాలంటైన్స్ డే ప్రత్యేక కానుక ఇచ్చారు సుకుమార్. కపుల్ విగ్రహంతోపాటు అందమైన ఫ్లవర్ బోకేను అందజేశారు. ఇన్స్టా వేదికగా దీనిని షేర్ చేసిన ఆమె థాంక్యూ మై లవ్ అంటూ ఆయన్ని ట్యాగ్ చేశారు.

## రిపబ్లిక్ స్పోర్ట్స్

### ఒకరోజు ముందే ఐపీఎల్ కొత్త సీజన్ స్టార్ట్..

## సన్రైజర్స్ మ్యాచ్ ఎప్పుడు ఉండొచ్చంటే?

ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసిన రెండు వారాల్లోనే క్రికెట్ అభిమానులను అలరించేందుకు మెగా టీ20 లీగ్ సిద్ధమవుతోంది. ఐపీఎల్ 2025 సీజన్కు సంబంధించి ఓ ఆసక్తికర విషయం బయటకు వచ్చింది.




ఇండియన్ ప్రీమియర్ లీగ్ కొత్త సీజన్ కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఐసీసీ మెగా టోర్నీ ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసిన కొద్ది రోజుల్లోనే టీ20 లీగ్ అలరించనుంది. తొలుత మార్చి 23 నుంచి ఐపీఎల్ 2025 సీజన్ పోటీలు ప్రారంభమవుతాయని వార్తలు వచ్చాయి. తాజాగా మరో అప్డేట్ వచ్చేసింది. మార్చి 22న అంటే ఒక్కరోజు ముందుగానే 18వ ఎడిషన్ ప్రారంభం కానుంది. ఈమేరకు క్రిక్ బజ్ వర్గాలు పేర్కొన్నాయి. తొలి మ్యాచ్ గతేడాది ఛాంపియన్ కోల్కతా నైటైడర్స్-రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఈడెన్ గార్డెన్స్‌లో జరగనుంది. ఇక గత సీజన్లో ఫైనల్కు చేరిన సన్రైజర్స్ హైదరాబాద్ తన తొలి మ్యాచ్ను సొంత మైదానం ఉప్పల్ స్టేడియంలో ఆడనుంది. రాజస్థాన్ రాయల్స్‌తో మార్చి 23న తలపడనున్నట్లు కథనాలు పేర్కొన్నాయి. ఐపీఎల్ 2025 సీజన్ ఫైనల్ మ్యాచ్ మే 25న జరిగే అవకాశం ఉంది. అయితే, ఐపీఎల్ వర్గాల నుంచి మాత్రం అధికారికంగా దీనిపై ఎలాంటి ప్రకటన వెలువడలేదు. షెడ్యూల్కు సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. మొత్తం మ్యాచ్లు 12 మైదానాల్లో జరగనున్నాయి. అహ్మదాబాద్, ముంబయి, చెన్నై, బెంగళూరు, లఖ్నవూ, ముల్లాన్పుర్, దిల్లీ, జైపుర్, కోల్కతా, హైదరాబాద్ స్టేడియాలతోపాటు గువాహటి, ధర్మశాల కొన్ని మ్యాచ్లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. రాజస్థాన్ రాయల్స్కు గువాహటి రెండో హోం గ్రౌండ్గా.. పంజాబ్ కింగ్స్కు ధర్మశాల రెండో సొంత మైదానంగా ఉండనున్నాయి.

### ఆ జట్ల కెప్టెన్సీ ఎవరికో?

మొత్తం 10 జట్లు ఐపీఎల్ 2025 సీజన్లోనూ తలపడనున్న సంగతి తెలిసిందే. రిటెన్షన్ విధానంతోపాటు ఐపీఎల్ మెగా వేలంలో ఆటగాళ్లను ఫ్రాంచైజీలు తీసుకున్నాయి. దీంతో పది జట్లలో కొన్నింటికి ఇంకా సారథులను అధికారికంగా ప్రకటించలేదు. గురువారమే ఆర్సీబీ కెప్టెన్గా రజత్ పటీదార్ నియమితులయ్యాడు. ఇప్పటికే ముంబయికి హార్దిక్, చెన్నైకి రుతురాజ్ గైక్వాడ్, హైదరాబాద్కు పాట్ కమిన్స్, గుజరాత్కు గిల్, లఖ్నవూకు రిషబ్ పంత్, రాజస్థాన్కు సంజు శాంసన్, పంజాబ్ కింగ్స్కు శ్రేయస్ అయ్యర్ ఉన్నారు. ఇంకా కోల్కతా నైటైడర్స్, దిల్లీ క్యాపిటల్స్కు సారథులను నియమించాల్సిఉంది. ఢిల్లీకి కేఎల్ రాహుల్ లేదా అక్షర్ పటేల్లో ఒకరికి అవకాశం ఉంది. కేకేఆర్ విషయంలోనే ఇంకా ఓ స్పష్టత రావడం లేదు.

## అందం

## ఏం ట్రై చేసినా తెల్ల జుట్టు సమస్య తగ్గడం లేదా? కొన్ని ఇంటి చిట్కాలతో నల్లగా మారుతుంది

హెన్నా, హెయిర్ డై, మార్కెట్‌లో దొరికే వివిధ ప్రొడక్ట్స్ వాడి తెల్ల జుట్టు కాస్తా నల్లగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా కొన్ని సార్లు ఫలితం ఉండకపోవచ్చు. తెల్ల జుట్టును సహజంగానే నల్లగా మార్చుకోవడానికి కొన్ని ఇంటి నివారణలు అద్భుతంగా పనిచేస్తాయి. అలాంటి ఇంటి చిట్కాల గురించి ఇక్కడ తెలుసుకుందాం.



ప్రతి ఒక్కరి అందంలో జుట్టు కీలకపాత్ర పోషిస్తుంది. చాలా మంది.. ఒత్తైన, మెరిసే, పొడవైన కేశాలు ఉండాలని కోరుకుంటారు. అయితే, జుట్టు అందరికీ ఒకేలా ఉండకపోవచ్చు. జన్యులోపాలు, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు, కాలుష్యం కారణంగా తెల్లజుట్టు ఈ జనరేషన్‌లో పెద్ద సమస్యగా మారింది. తెల్ల జుట్టుతో నలుగురిలోకి వెళ్లాలంటే కొందరు ఇబ్బంది పడుతున్నారు. నిండా ముప్పై ఏళ్లు నిండక ముందే తలంతా తెల్ల వెంట్రుకలతో కనిపించే వాళ్లు చాలా మంది ఉన్నారు. కొందరు ఈ సమస్య గురించి అంతగా పట్టించుకోరు. మరికొందరు మాత్రం సీరియస్‌గా ఉంటారు. హెన్నా, హెయిర్ డై, మార్కెట్‌లో దొరికే వివిధ ప్రొడక్ట్స్ వాడి తెల్ల జుట్టు కాస్తా నల్లగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా కొన్ని సార్లు ఫలితం ఉండకపోవచ్చు. తెల్ల జుట్టును సహజంగానే నల్లగా మార్చుకోవడానికి కొన్ని ఇంటి నివారణలు అద్భుతంగా పనిచేస్తాయి. అలాంటి ఇంటి చిట్కాల గురించి ఇక్కడ తెలుసుకుందాం.

### ఉసిరి, శీకాయ వాడకం



ఉసిరి, శీకాయ రెండూ జుట్టుకు మేలు చేస్తాయి. ఉసిరిలో ఎన్నో పోషకాలు ఉన్నాయి. విటమిన్ సి, అవసరమైన కొవ్వు ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లు మెండుగా ఉన్నాయి. ఈ పోషకాలన్నీ జుట్టుకు తగిన పోషణ అందిస్తాయి. జుట్టుకు ఆరోగ్యంగా ఉంచడంలో ఉసిరి పొడి కీలక పాత్ర పోషిస్తుంది. ఇక, శీకాయలో జుట్టు తెల్లబడకుండా నిరోధించే యాంటీ ఆక్సిడెంట్లు ఉన్నాయి. ఈ రెండింటిని కలిపి వాడితే తెల్లజుట్టు నల్లగా మారుతుంది. ఇందుకోసం, ఉసిరి పొడి, శీకాయ పొడిని కలిపి పేస్టులా తయారుచేసుకోండి. ఆ తర్వాత జుట్టు మొత్తం అప్లై చేయండి. ఓ ముప్పై నిమిషాల పాటు అలాగే ఉంచి ఆ తర్వాత షాంపూతో తలస్నానం చేయండి. వారానికి రెండు సార్లు ఇలా చేస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయి.

### కొబ్బరి నూనె, వెల్లుల్లి వాడకం



జుట్టు సంరక్షణ కోసం కొబ్బరి నూనెను ఎప్పట్నుంచో వాడుతున్నారు. కొబ్బరి నూనెతో జుట్టుకు తగిన సంరక్షణ అందుతుంది. కొబ్బరి నూనె జుట్టును తేమగా ఉంచుతుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లతో పాటు అనేక రకాల పోషకాలు ఉంటాయి. ఇవి జుట్టు రాలడాన్ని తగ్గిస్తాయి. జుట్టు పెరుగుదలను కొబ్బరి నూనె ప్రోత్సాహిస్తుంది. కొబ్బరి నూనెతో మసాజ్ చేయడం వల్ల జుట్టు రాలడం తగ్గిపోతుంది. ఇక, వెల్లుల్లిలో సల్ఫర్ ఉంటుంది. ఇది జుట్టు తెల్లబడకుండా నిరోధిస్తుంది. ఇందుకోసం కొబ్బరి నూనె, వెల్లుల్లి కలిపి రెండింటిని పేస్టులా చేసుకోండి. ఆ తర్వాత జుట్టు మొత్తానికి అప్లై చేయండి. ఆ తర్వాత ముప్పై నిమిషాల పాటు అలాగే ఉంచి వాష్ చేసుకోండి.

### భృంగరాజ్, బ్రాహ్మీ పౌడర్




శతాబ్దాలుగా ఆయుర్వేదం అనేక వ్యాధుల్ని నయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఆయుర్వేద చిట్కాలు ఇప్పటికీ సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. ఇక, బ్రాహ్మీ మొక్క, వేర్లు, పువ్వుల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఇక, బ్రాహ్మీ పౌడర్ మార్కెట్లో దొరకుతుంది. ఇది జుట్టుకు తగిన పోషణ అందిస్తుంది. తలపై సహజ రక్షణ పొరను సృష్టిస్తుంది. దీంతో, పొల్యూషన్, దుమ్ము, ధూళి ఎఫెక్ట్ నుంచి కేశాలను రక్షిస్తుంది. అంతేకాకుండా తెల్ల జుట్టును సహజంగానే నల్లగా మారుస్తుంది. భృంగరాజ్‌లో జుట్టును బలోపేతం చేసే యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఈ రెండింటి పొడిని కలిపి పేస్టులా తయారుచేసి జుట్టుకు అప్లై చేస్తే తెల్ల జుట్టు నల్లగా మారుతుంది.

### ఇది కూడా ట్రై చేయండి



తెల్ల జుట్టును నల్లగా మార్చే హెయిర్ ప్యాక్ కోసం ముందుగా రెండు నుంచి మూడు స్పూన్ల బ్రాహ్మీ పౌడర్ తీసుకోండి. ఈ పొడిని నీళ్లల్లో కలిపి చిక్కటి పేస్టులా చేసుకోండి. ఈ మిశ్రమంలో రెండు స్పూన్ల హెన్నా వేసి బాగా మిక్స్ చేసుకోండి. కాసేపు తర్వాత ఈ ప్యాక్‌ను జుట్టుకు బాగా అప్లై చేయండి. జుట్టు కుదళ్ల వరకు అప్లై చేయండి. ఈ హెయిర్ మాస్క్‌ను ఒక గంట పాటు అలాగే ఉంచాలి. ఆ తర్వాత తేలికపాటి షాంపూతో తలస్నానం చేస్తే సరిపోతుంది. అయితే, ఈ హెయిర్ ప్యాక్ అప్లై చేసేటప్పుడు జుట్టు జిడ్డుగా ఉండకూడదు. పొడిగా ఉండేలా చూసుకోండి. ఇలా నెలకు మూడు నుంచి నాలుగు సార్లు చేస్తే తెల్ల జుట్టు సహజంగానే నల్లగా మారుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

### ఇవి కూడా ముఖ్యం



- విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉండే ఆహారాన్ని తినండి.
- ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం వంటివి చేయండి.
- జుట్టును క్రమం తప్పకుండా వాష్ చేసుకోండి. కండీషనర్ వాడండి.
- తేలికపాటి షాంపూని ఉపయోగించండి. రసాయనాలతో కూడిన డైల వాడకాన్ని తగ్గించండి.
- బయోటిన్ ఎక్కువగా ఉండే ఆహారాల్ని తీసుకోండి.

**గమనిక**

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.